క్లుప్తంగా

మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మంచి ఆలోచనలతో అడుగులు వేసినప్పుడు చక్కని విజయాలను అందుకుంటారని మన స్తత్వవేత్త డాక్టర్ బి.అరుణ అన్నారు. పొట్టిశ్రీ రాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బ్యాలెన్సింగ్ సోషల్ లైఫ్ విత్ స్టడీస్' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాలను సాధించేందుకు నిర్దిష్ట ప్రణాళికలు అవసరమన్నారు. పరీక్షలు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ముందుకు సాగాలన్నారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇతరులకు మంచి జరగాలనే భావనతో ఉంటే మనకు మేలు కలుగుతుందనే భావనలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.మనస్విని, ఐసీసీ కన్వీనర్ డాక్టర్ ఎ.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గురువు రాజారావుకు సత్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాబుద్ధులు నేర్పి తమను ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దిన గురువు బెజవాడ రాజారావుకు పూర్వ విద్యార్థులు అభినందన సత్కారం చేశారు. వన్‌టౌన్‌లోని తేలప్రోలు రాజా హైస్కూల్లో పదో తరగతి (1971–72 బ్యాచ్) చదివిన పలువురు పూర్వ విద్యార్థులు శనివారం విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్ కరస్పాండెంట్ రాజారావును కలిసి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. మంగళగిరిలో భవానీ స్పెషాలిటీస్ హాస్పటల్‌ను నెలకొల్పానని కె.సత్యనారాయణరావు, ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నానని బీఎస్ఆర్ చంద్రశేఖర్ ఇలా పలువురు గురువు రాజారావుకు వివరించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. స్పందించిన రాజారావు మాట్లాడుతూ నా వద్ద విద్య నేర్చుకుని సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న మీరంతా గుర్తు పెట్టుకుని అర్థశతాబ్దం తర్వాత వచ్చి కలవడం గురువుగా గర్వకారణంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. పదుగురికి తమకు ఉన్నంతలో సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

అన్న క్యాంటీన్లపై నిరంతర పర్యవేక్షణ

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో శనివారం సిబ్బందితో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వీఎంసీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 11 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షించడానికి 11 మంది నోడల్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. వారు అందుబాటులో ఉండి ఎటువంటి సమస్యైనా వెంటనే సంబంధిత శాఖలకు తెలియపరచాలని, ఆ శాఖాధిపతులు 15 నిమిషాల్లో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

జీఎన్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోని గొల్లపల్లి నాగేశ్వరరావు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. స్థానికులు రెడ్డిపల్లి రాజు, యలకల అనిల్ కుమార్ స్వచ్ఛందంగా అందించిన సుమారు వెయ్యి లాంగ్ నోట్ బుక్స్‌ను పాఠశాలలోని 450 మంది విద్యార్థినీ విద్యార్థులకు అందజేశారు. ముఖ్యఅతిథులు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడారు. లయన్స్ గెలాక్సీ క్లబ్ సభ్యుడు కిషోర్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, ప్రధానోపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లి, నాలుగేళ్ల కుమార్తె అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు, భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన మారడబుడి దుర్గారావు ఆటోడ్రైవర్. అతనికి భార్య హేమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కొంత కాలంగా స్థానికుడు విజయ్‌కుమార్‌తో మాట్లాడుతోంది. ఇది గమనించిన భర్త దుర్గారావు పలు మార్లు ఇద్దరినీ మందలించాడు. ఆమె తీరులో మార్పు రాలేదు. ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాలుగేళ్ల పాపతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారికోసం పలుచోట్ల వెదికినా ఫలితం లేదు. దీనిపై భవానీపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో విజయ్‌కుమార్ కూడా ఇంట్లో లేడు. అతనికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని, అతనిపై అనుమానం ఉందని దుర్గారావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరసనల హోరు!

- ప్రాణం పోసే వైద్యులకే రక్షణ లేదా!
- కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- 'బెంగాల్' ఘటనపై ఆగ్రహం
- విధులు బహిష్కరించి సంఘీభావం తెలిపిన వైద్య సిబ్బంది
- అత్యవసర సేవలు మినహా మూతపడిన ఆసుపత్రులు



వన్‌టౌన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనపై 'పశ్చిమ'లో నిరసనలు హోరెత్తాయి. 'బెంగాల్'లో జరిగిన అఘాయిత్యానికి నిరసనగా శనివారం ఆందోళనలు కొనసాగాయి. వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. వన్‌టౌన్‌లోని పలు ఆస్పత్రులు, అత్యవసర సేవలు మినహా 24 గంటల పాటు వైద్య సేవలను బహిష్కరించాయి. రోడ్లపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాయి. ర్యాలీలు, మానవహారాలు, ధర్నాలు తదితర కార్యక్రమాలతో కోలకతా సంఘటనలకు నిరసనలను వ్యక్తం చేశారు. వైద్య సిబ్బందికి కళాశాలల్లోని విద్యార్థినులు సైతం మద్దతు తెలిపి ర్యాలీల్లో పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది విధుల బహిష్కరణ

పాతబస్తీలోని ప్రభుత్వ వైద్యశాలలకు సంబంధించిన వైద్యులు, సిబ్బంది, పీజీ విద్యార్థులు విధులను బహిష్కరించి భారీ ర్యాలీని నిర్వహించాయి. 'పశ్చిమ'లోని వివిధ ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాతబస్తీలోని షేక్ రాజాసాహెబ్ ఆస్పత్రికి చేరుకొని అక్కడి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కేటీరోడ్డు మీదుగా చిట్టినగర్ సెంటర్‌కు ర్యాలీ చేరుకొని అక్కడ మానవహారాన్ని ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి కేఎల్‌రావు ఆస్పత్రి వరకూ వెళ్లి తిరిగి పాతబస్తీలోని హిందూహైస్కూల్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తిరిగి ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా.. ఘటనపై పూర్తి విచారణ జరగాలి, దోషులను కఠినంగా శిక్షించాలి, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా కఠినంగా చట్టాలు అందుబాటులోకి తేవాలని కోరుతూ నినాదాలు చేశారు. వారికి మద్దతు కేబీఎన్ కళాశాల, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థల విద్యార్థినిలు సైతం ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతికిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, ఏపీవీవీపీ డాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కోలకతా ఘటనకు నిరసన ఆందోళనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అత్యవసర సేవలు మినహా ఓపీ ఇతర వైద్య సేవలను 24 గంటల పాటు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి దారుణాలను అందరూ ఖండించాలన్నారు. సమాజానికి అండగా ఉండే వైద్యులపై ఇంతదారుణంగా వ్యవహరించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బిందు, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ గౌస్‌బాషా, డాక్టర్ తనూజ, కేబీఎన్ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా పిడియాట్రిక్స్ అసోసియేషన్ నాయకురాలు డాక్టర్ మాజేటి మాధవి డిమాండ్ చేశారు. పాతబస్తీలోని అనురాగ్ హాస్పిటల్స్ వద్ద డాక్టర్ మాధవి తన సిబ్బందితో కలిసి కోలకతా సంఘటనకు నిరసనగా ధర్నా నిర్వహించారు. వైద్య సేవలను బహిష్కరించారు. స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు మద్దతు పలికారు.

ఫార్మా డీలర్స్ ఆధ్వర్యాన..

జిల్లా ఫార్మా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనను పాతబస్తీలో నిర్వహించారు. పాతబస్తీలోని భావనారాయణవీధి, చల్లంరాజు వారివీధి, తాటాకులవారివీధి, పార్కురోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీని నిర్వహించారు. సంఘ అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



షేక్ రాజాసాహెబ్ ఆస్పత్రి వద్ద నిరసన ప్రదర్శన



అనురాగ్ ఆస్పత్రి వద్ద..



ఫార్మాడీలర్స్ అసోసియేషన్ నిరసన

కేసును త్వరితగతిన విచారణ చేయండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్వహణలోని ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో దుర్ఘటన జరగడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఆమెపై జరిగిన హత్యోదంతంపై మానవతా దృక్పథంతో నగరంలోని నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులపై ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. వైద్య విద్యార్థులపై ప్రిన్సిపాల్ వ్యవహరించిన తీరు మానవత్వానికి మాయని మచ్చ అని తెలిపారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న వారిపై ఇటువంటి దుర్ఘటనలకు పాల్పడకుండా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసును త్వరితగతిన విచారించి నిందితులకు ఉరి శిక్ష పడేలా చూడాలని దర్యాప్తు బృందాన్ని కోరారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సారా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలాకర్ పేర్కొన్నారు. సారా ఫౌండేషన్ ఆధ్వర్యాన పోరంకిలో ఈ నెల 15న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించింది. అందులో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులను ప్రదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, గుంటూరు డివిజన్ డీసీఎం కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై క్విజ్ పోటీలు, మై విజన్ ఇండియాపై వ్యాసరచన, స్వాతంత్ర్య పోరాటాలపై డ్రాయింగ్ పోటీలు, దేశ భక్తి పాటలు, నృత్య ప్రదర్శలు, హస్తకళలు తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 60 మంది విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతో నగరాభివృద్ధి



వీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఎంప్లాయీస్ అందరూ సహకరిస్తేనే నగరాభివృద్ధి చెందుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో శనివారం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు యూనియన్ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మున్సిపల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రమోషన్లపై కమిషనర్‌ను కోరారు.

దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి తాను ముందుంటానని చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర, వీఎంసీ యూనిట్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు తిమసర్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్ ఇతర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

నేడు టీటీ రాష్ట్ర ర్యాంకింగ్ ఫైనల్స్



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయని పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. దామోదర్‌రెడ్డి తెలిపారు. వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలు శనివారం రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగాయి. అండర్ 11, 13, 15, 19, సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో క్రీడాకారులు తలపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, దామస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. సీనియర్ పురుషుల విభాగంలో టి.సూర్యతేజ, కుషల్ దాస్, మహిళల విభాగంలో ఆర్.కాజల్ సునార్, వి.గుణసంయుక్త, అండర్–17 బాలుర విభాగంలో టి.సంవేద్, పి.జాతిన్ రెడ్డి, బాలికల విభాగంలో ఆర్ఎస్‌వీఎస్‌జీ రేణుకసత్య, పి.హాసిని ఫైనల్స్‌కు చేరుకున్నారని దామోదర్ రెడ్డి తెలిపారు. ఆదివారం టోర్నీ ముగియనుందని, ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు.

ఆత్మీయబంధానికి ప్రతీక రక్షాబంధన్

- రేపు రాఖీ పౌర్ణమి
- ఆకట్టుకుంటున్న విభిన్న రాఖీలు
- కళకళలాడుతున్న వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ దుకాణాలు
- ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు
- ఈ ఏడాది బంగారు దుకాణాల్లో వెండి రాఖీలు
- చిన్నారులను అలరిస్తున్న డోరేమాన్, బ్యాట్‌మ్యాన్ రాఖీలు



వివిధ మోడల్స్‌లో వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్‌లో విక్రయిస్తున్న రాఖీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్నా చెల్లెళ్లు.. అక్కా, తమ్ముళ్ల మధ్య ఆత్మీయ బంధానికి చిహ్నంగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకున్నా... మన కోసం అండగా నిలిచే అప్పుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదరభావాన్ని పెంపొదించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. సోదరుడంటే తోడబుట్టిన వాడే కానక్కర్లేదు. చెల్లెమ్మ... నేనున్నానంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానమే. వీరి అనుబంధానికి ప్రతీకగా శ్రావణ పౌర్ణమి నాడు రాఖీ పండుగ జరుపుకుంటారు.

జోరందుకున్న అమ్మకాలు

ఈ నెల 19వ తేదీ సోమవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లో రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న మోడల్స్‌లో రాఖీలు యువతకు కనువిందు చేస్తున్నాయి. ఈ సారి వివిధ రూపాల్లో మార్కెట్‌లోకి రాఖీలు వచ్చాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ దుకాణాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రాఖీలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో ఆయా దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి.

చిన్నారులను ఆకట్టుకుంటున్న రాఖీలు

చిన్నారులకు ఆకట్టుకునేందుకు డోరేమాన్, మోటుపంతులు, మిక్కీమౌస్, హనుమాన్ వంటి బొమ్మలను రాఖీలపై ఏర్పాటు చేయడంతో వాటిని చిన్నారులు ఆసక్తిగా చూసి కొనుగోలు చేస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా వాటిని తయారు చేశారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లోనూ విస్తృతంగా అమ్మకాలు

దుకాణాల్లోనే కాకుండా ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్లలో రాఖీలకు సంబంధించి అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటికి పలు ఆఫర్లను సైతం అందిస్తున్నాయి. దానికి తోడు వెండితో తయారు చేసిన రాఖీలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఎనిమిది వందల నుంచి నాలుగు వేల వరకూ వెండితో తయారు చేసిన రాఖీలు విక్రయిస్తున్నారు. ప్రముఖ బంగారు దుకాణాలు సైతం ఆన్‌లైన్‌లో ఇలాంటి రాఖీలను విక్రయిస్తున్నాయి.

రూ.5 నుంచి రెండు వందల వరకూ ధరలు

రాఖీలు ఐదు నుంచి రెండు వందల రూపాయల వరకూ ధర పలుకుతున్నాయి. అన్ని వర్గాలకు అవసరమైన రాఖీలను వన్‌టౌన్‌లో విక్రయిస్తున్నారు. వీటిని ఆయా రిటైల్ మార్కెట్లలో రెట్టింపు ధరలకు విక్రయిస్తారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్ నుంచి కేవలం విజయవాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాకే పరిమితం కాకుండా గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం తదితర జిల్లాల నుంచి కూడా వ్యాపారులు రాఖీలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో రెండు మూడు రోజులుగా రాఖీల వ్యాపారం వన్‌టౌన్‌లో జోరుగా సాగుతోంది.

దాతల సహకారంతో లక్ష్య సాధన



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సుబ్రహ్మణ్యం ప్రకాశరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలతో విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని విశ్రాంత డీసీటీఓ ఎం. సుబ్రహ్మణ్యం, సీనియర్ న్యాయవాది ప్రకాశరావు అన్నారు. చెన్నైకు చెందిన ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ వి.రత్నరాజు, హైదరాబాద్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి జానకి షర్మిల దంపతుల కుమార్తె రామస్నిగ్ధ జ్ఞాపకార్థం విద్యార్థులకు సుమారు రూ.60 వేల విలువ చేసే నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్‌లో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సుబ్రహ్మణ్యం, ప్రకాశరావు నోట్ పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకుండా దాతలు అందిస్తున్న చేయూతతో విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి సమాజాభివృద్ధికి దోహదపడుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులు పేద విద్యార్థులకు తమవంతు సాయం అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలన్నారు. అప్పుడే గతంలో తాము దాతల సాయంతో చేరుకున్న ఉన్నత స్థాయికి సార్థకత ఏర్పడుతుందన్నారు. డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, ఎం నరసింహారావు, నాగేశ్వరరావు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తరుణ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔషధ పరిశోధనలో నూతన ఆవిష్కరణ



డాక్టర్ రామకిషన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, డాక్టర్ రమణ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఔషధ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగించేందుకు శనివారం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఆ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో జాతీయ కేంద్ర నియంత్రణ మండలి డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.రామకిషన్, డాక్టర్ ఎం శ్రావణ్ కుమార్‌లతో పాటు, ఐపీఏ ఎడ్యుకేషన్ చైర్‌పర్సన్ ఎస్. విద్యాధర పాల్గొన్నారు. ఔషధ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలను విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సునీత, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఈశ్వర్, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో 10 ఫార్మసీ కళాశాలల నుంచి 375 మంది విద్యార్థులు పాల్గొనగా, 75 మంది పోస్టర్ ప్రజెంటేషన్స్ చేశారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులకు విశేష పూజలు



అంకురార్పణ చేస్తున్న పండితులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఏటా శ్రావణమాసంలో పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. తొలి రోజు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలతో స్వామి వారి పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. ఆగమ పండితుల నేతృత్వంలో కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి సన్నిధిలో ప్రార్థనా సూక్తం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షా స్వీకరణ, అంకురారోహణాదులు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఏడాది పొడవునా స్వామి సన్నిధిలో తెలిసి తెలియక ఏదైనా పొరపాటు జరిగినా, రాకూడని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించినాఅపచారం జరుగుతుందన్నారు. వాటి ప్రాయశ్చితం చేసేందుకు ఏటా శ్రావణమాసంలో స్వామి వారి సన్నిధిలో పవిత్రోత్సవాలను నిర్వహిస్తామన్నారు. దీంతో స్వామి వారి శక్తి మరింత ద్విగిణీకృతమవుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలోని ఇతర ఉపాలయాల్లోనూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

సమరయోధుడి విగ్రహం కనపడకుండా ఫ్లెక్సీలా!



చిట్టి పార్క్‌ను మూసేస్తూ కట్టిన ఫ్లెక్సీలు

స్వాతంత్య్ర దినోత్సవ వేళ సమరయోధుడి విగ్రహం కనబడకుండా ఫ్లెక్సీలు కట్టడమేనా ఆయనకు మన మిచ్చే గౌరవం అని చిట్టినగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే సర్దార్ మరుపిళ్ల చిట్టి పేరుతో చిట్టినగర్‌లో పార్కు ఉంది. దీనిలోపల ఉన్న చిట్టి విగ్రహం కనపడకుండా అధికార పార్టీల నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పార్క్‌ను మూసేస్తూ కట్టిన ఫ్లెక్సీలు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కళ్లకు కనిపించడం లేదా అని ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. –భవానీపురం(విజయవాడపశ్చిమ)

దుర్గమ్మకు నృత్యాంజలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు చెన్నైకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి ఘటించారు. దుర్గగుడిలో ప్రతి రోజూ నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణులు భరతనాట్యంతో భక్తులను అలరించారు. మైత్రి సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ (చెన్నై) సంస్థకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి అంశంతో ప్రారంభించి 'శివోహం', 'ఆనంద నటన ప్రకాశం', 'గోవిందం', 'దేవి – మాతృ సమర్పణం' అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నర్తించారు. వారి అద్భుత నాట్యంతో భక్తులు తన్మయులై హర్షధ్వానాలు చేశారు.